క్లుప్తంగా

స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

పాయకరావుపేట: మండలంలోని సత్యవరంలో స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ కె.శ్రీనివాసరావు పరిశీలించింది. గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ సెంటర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెత్త నుంచి సంపద కేంద్రం, గ్రామంలో పారిశుధ్యం, హౌస్‌హోల్డ్ పర్యటన చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాలు అభివృద్ధి చేయాలని, పారిశుధ్య లోపం లేకుండా ఎప్పటికప్పుడు డ్రైనేజీలు పూడికతీత తీయాలని, రోడ్డు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. సర్పంచ్ సకిలేటి రాము, సచివాలయ కార్యదర్శి పీఎస్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

బోదిగల్లం పాఠశాల విద్యార్థుల విన్యాసం



ఏడు, తొమ్మిది అంకెలు ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన

నక్కపల్లి: మండలంలో పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు గురువారం పలు విన్యాసాలు చేశారు. అతిపెద్ద జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులు 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 7, 9 అంకెలుగా ఏర్పడి విన్యాసాలు నిర్వహించారు. శుక్రవారం ఇక్కడ పతాకావిష్కరణ నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

వెంకన్న ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తుడు ఆదివిష్ణు

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనికి పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం మునగపాకకు చెందిన పెంటకోట ఆదివిష్ణు రవిశంకర్, వెంకట రమ్యకుమారి దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారు. కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, బొడ్డేడ రాము నాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పీఏసీఎస్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న నూక నరసింగరావు,డైరెక్టర్లు

మునగపాక: రైతు సంక్షేమమే ధ్యేయంగా సేవలందించేందుకు కృషి చేస్తామని మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విల్లూరి నూక నరసింగరావు పేర్కొన్నారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా నియమితులైన ఆయన డైరెక్టర్లు పాలిపిని రాము, అప్పలరాజుతో కలిసి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సంఘ సిబ్బంది నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. పీఏసీఎస్ సీఈవో పెంటకోట మహేష్, సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



యండపల్లిలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఐబీఆర్ఎస్ గ్రామం యండపల్లిలో గురువారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. డ్రైనేజీలలో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. చెత్త సేకరణకు పారిశుధ్య కార్మికులకు సహకరించాలని గ్రామస్తులకు సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, కార్యదర్శి రఘురాం పాల్గొన్నారు.

143 హామీలేమయ్యాయి చంద్రబాబు?

- ప్రజల్లోకి వెళ్లాలంటే వణుకుతున్న కూటమి నాయకులు
- బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీలో సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



పోతురెడ్డిపాలెంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యలమంచిలి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



పోతురెడ్డిపాలెంలో కార్యక్రమానికి హాజరైన మహిళలు



పురుషోత్తపురంలో కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తున్న కరణం ధర్మశ్రీ

యలమంచిలి రూరల్: ఎన్నికల సమయంలో 143 హామీలిచ్చి అధికారం దక్కించుకుని 14 నెలలు కావస్తున్నా ఒక్క హామీని సక్రమంగా అమలు చేయని కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం యలమంచిలి మండలం రుక్మిణీపురం, పోతురెడ్డిపాలెం, పురుషోత్తపురం గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఆయా గ్రామాల్లో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ఎలా మోసం చేసిందో, ఆర్థికంగా ఎంత నష్టపోయారో ప్రజలకు వివరించారు. సంపద సృష్టిస్తానని చెప్పి ఏడాది పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. రాష్ట్రంలో వలంటీర్లు, ఎండీఎం డ్రైవర్లు, మద్యం షాపుల్లో సిబ్బంది ఇలా 3 లక్షల ఉద్యోగాలు పీకేశారన్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు, ఆడబిడ్డ నిధి నెలకు రూ.1500 ఇస్తామని మోసం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల సామాజిక భద్రత పింఛన్లను తొలగించి పేదలకు అన్యాయం చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు,అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ఒక్క వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిలకే దక్కిందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు వంటి పథకాల్లో కోత పెట్టారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ సంతకాలు పెట్టి బాండ్ పేపర్లు ఇచ్చారని, వీటిపై కూటమి నాయకులను ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీపీ బోదెపు గోవింద్, వైఎస్సార్‌సీపీ యలమంచిలి మండల, పట్టణ అధ్యక్షులు కొల్లి త్రినాథ్, బొద్దపు ఎర్రయ్యదొర, పార్టీ సీనియర్లు దూది నర్సింహమూర్తి, సేనాపతి రాము, మత్రి రాజు, కాళ్ల సీతారాం, రానాజ శ్రీను(రేగుపాలెం), రాజాన అచ్చారావు, మాజీ ఇత్తంశెట్టి సత్యనారాయణ, పోతురెడ్డిపాలెం ఉప సర్పంచ్ ఇత్తంశెట్టి వెంకటరమణ, కాళ్ల వరప్రసాద్, కాళ్ల గణేష్, కాళ్ల శ్రీను మాస్టారు, పసగడుగుల రమేష్, రాజాన సత్యనారాయణ(వీసీపీ), గొర్లె చిన్న, ఇత్తంశెట్టి అక్కయ్యమ్మ, ఇత్తంశెట్టి గంగరాజు, ఇత్తంశెట్టి శ్రీనివాసరావు, త్రిమూర్తులు, కాళ్ల అప్పలనాయుడు, రుక్మిణీపురం సర్పంచ్ కరణం సత్తిబాబు(పండు), ఉప సర్పంచ్ సీహెచ్ ప్రసాద్, ఎడ్ల వాసు, దేవరపల్లి రమణ, ఆదిరెడ్డి, బలిజ ప్రసాద్, లాలం లోవరాజు, కరణం తాతలు, దొడ్డి రామకృష్ణ, కరణం సత్తిబాబు, కరణం శ్రీను, రాజాన గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో భూముల ధరలు పెంచుకోవడానికే

అమరావతిని అద్భుతమైన రాష్ట్ర రాజధానిగా నిర్మిస్తామని చెబుతున్న చంద్రబాబునాయుడు మాటలన్నీ అక్కడ భూముల ధరలు పెంచుకోవడానికేనని కరణం ధర్మశ్రీ విమర్శించారు. అందుకే మళ్లీ భూసేకరణ చేస్తున్నారన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అమరావతి ప్రాంతం పూర్తిగా మునిగిపోయిందన్నారు. అక్కడ రాజధాని నిర్మాణం పేరుతో వేల కోట్లు పెట్టుబడి పెట్టి రాష్ట్ర సంపదను వృథా చేస్తున్నారని ఆరోపించారు. ఈ సారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినపుడు గ్రామ స్థాయిలో పార్టీ నాయకులే సంక్షేమ పథకాల బటన్‌లు నొక్కుతారని చెప్పారు. పార్టీకోసం కష్టపడి పనిచేసే నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అందరూ పార్టీని ఆదరించాలని కోరారు.

తూర్పు కాపు సంక్షేమ సంఘ భవనం ప్రారంభం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన బాలగణపతి తూర్పు కాపు సంక్షేమ సంఘ సామాజిక భవనాన్ని గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించారు. స్థలాన్ని పంచాయతీ సమకూర్చగా, స్థానిక కాపు నేతలు విరాళాలు సేకరించి నూతనంగా భవనాన్ని నిర్మించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కాపు కులస్తులు సోదరభావంతో మెలగాలన్నారు. సంఘాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పెద్దలు పెంటకోట సత్యనారాయణ, కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి లక్ష్మణరావు, కాశీబాబు, కాండ్రేగుల జగన్, ఆడారి గోపీ, సంఘ అధ్యక్షుడు బలిరెడ్డి సూరప్పారావు, గాలి నాగేష్, కస్పా శ్రీను, బలిరెడ్డి రాజు, బుదిరెడ్డి సూరప్పారావు, బలిరెడ్డి సంతోష్, చంద్రపాటి లోకేష్, బుదిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



సాగునీరు విడుదల చేస్తున్న అనకాపల్లి ఆవ కాలువ చైర్మన్ సన్యాసినాయుడు

మునగపాక: సీజన్‌లో రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి ఆవ కాలువ చైర్మన్ ఆడారి సన్యాసినాయుడు తెలిపారు. మండలంలోని తోటాడ త్రిమూర్తుల ఆలయం సమీపంలో గురువారం కాలువ గేట్లు ఎత్తి దిగువ ప్రాంతాలకు సాగునీరు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులకు సాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వరి సాగుకు ఈ సాగునీరు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు ఆడారి జగన్నాథరావు, పొలమరశెట్టి మురళి, ఆళ్ల వెంకటేష్, ఆడారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ..



తిరంగా యాత్రలో బండిమాంబ ఆలయం వద్ద విద్యార్థులు,ప్రజాప్రతినిధులు ర్యాలీ



నక్కపల్లి లో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కోటవురట్లలో తిరంగా ర్యాలీ చేస్తున్న యువకులు

కోటవురట్ల: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కోటవురట్లలో గురువారం తిరంగా యాత్ర చేశారు. బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పైల కనకరాజు ఆధ్వర్యంలో యువకులు జాతీయ పతకాలు చేతపట్టి హర్ ఘర్ తిరంగా అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. తహసీల్దారు కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ సాగింది.

నక్కపల్లిలో

నక్కపల్లి: హర్ ఘర్ తిరంగా యాత్ర నక్కపల్లిలో నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు, నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ఉపమాక రోడ్డు జంక్షన్ వరకు ఈ ర్యాలీ సాగింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ర్యాలీ నిర్వహించినట్లు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొప్పిశెట్టి వెంకటేష్, పీఏసీఎస్ డైరెక్టర్ కోసూరు శ్రీను పాల్గొన్నారు.

యువతలో దేశభక్తి పెంపొందించాలి

యలమంచిలి రూరల్: యువతలో దేశభక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందని ఏటికొప్పాక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గురువారం యలమంచిలి మండలం ఏటికొప్పాకలో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. స్థానిక పాఠశాల విద్యార్థులు, గ్రామ పెద్దలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో చేపట్టిన ఈ యాత్ర స్థానిక శివాలయం వద్ద నుంచి ప్రధాన రహదారి మీదుగా సచివాలయం, అక్కడ్నుంచి సంత కూడలి వరకు సాగింది. పౌరులంతా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాలను ఎగుర వేసుకోవాలని యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణిరాము ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో అగ్రహారపు కుమారస్వామి, కొరుపోలు చిన్నారావు, నక్కా శివశంకర్రావు, పప్పు ఈశ్వర్రావు, పిట్టా దాసుబాబు, మొల్లేటి ప్రసాద్, దాకా నూకరాజు, సెనంశెట్టి శ్రీను, నగిరెడ్డి శ్రీను, ఉగ్గిన బాబ్జీ, దేవరపు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలపై వివక్ష

- మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు
- పరిష్కరించని కూటమి ప్రభుత్వం



పీఎల్ పురం వద్ద మెగా జగనన్న కాలనీ




జగనన్న కాలనీలో మరమ్మతులకు గురవుతున్న మోటారు బోరు

పాయకరావుపేట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు సొంతింటి కలను సాకారం చేసింది. ఈ మేరకు జగనన్న కాలనీల్లో స్థలం ఇవ్వడంతోపాటు ఇళ్ల నిర్మాణాలకు సాయం చేసింది. దాంతో చాలా మంది ఇళ్లు నిర్మించుకుని గృహ ప్రవేశాలు చేశారు. వారికి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించకుండా కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోంది.

గత వైఎస్సార్‌సీపీ పాలనలో మండలంలోని 24 గ్రామాల పరిధిలోను 18 చోట్ల జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేశారు. అర్హులైన 2,400 మందికి ఇళ్ల నిర్మాణానికి పట్టాలు మంజూరు చేశారు. దీంతో కొంతమంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. విద్యుత్, రోడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల పనులు చేశారు. అనంతరం కూటమి అధికారంలోకి రావడంతో జగనన్న కాలనీల అభివృద్ధిపై నిర్లక్ష్యం చూపుతున్నారు. కాలనీల్లో కొన్ని చోట్ల విద్యుత్ సమస్య ఏర్పడింది. మండలంలో పీఎల్‌పురం గ్రామ పరిధిలో మెగా జగనన్న కాలనీలో రోడ్లు సక్రమంగా లేవు. కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల రాత్రి సమయంలో అంధకారం అలుముకుంటోంది. తాగునీటి సరఫరా చేసే బోరు తరచూ మరమ్మతులకు గురికావడం వల్ల కాలనీలో తాగునీటికి ఇబ్బందికరంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. వెంకటనగరం గ్రామ పరిధి జగనన్న కాలనీల్లో విద్యుత్ సమస్య ఏర్పడుతుందని నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



జగనన్న కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగన్ మోహన్‌రెడ్డి సొంతింటి కల నెరవేర్చాలని అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రుణాలు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి.

– చోడిపల్లి శ్రీను, మత్స్యకారుడు, వెంకటనగరం



జగనన్న కాలనీల్లో రోడ్డు దుస్థితి



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంక్

శ్రీకృష్ణాష్టమి సంబరాలు



రాధ, సత్యభామ వేషధారణలో చిన్నారులు

అచ్యుతాపురం రూరల్: కైట్స్ విద్యా విహార్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు, రాధ, సత్యభామ వేషధారణలతో విద్యార్థులు విశేషంగా ఆకట్టుకున్నారు. పలువురు విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో సందడి చేశారు. వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కైట్స్ విద్యా విహార్ కరస్పాండెంట్ రెడ్డి గణేష్ వారిని అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం, ధర్మవరం, పెదగుమ్ములూరు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరం పరిధిలో ఎస్.రాయవరం, సర్వసిద్ధి, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు, ధర్మవరం పరిధిలో వమ్మవరం గెడ్డపాలెం, పెదగుమ్ములూరు పరిధిలో పెదగుమ్ములూరు, భీమవరం, గోకులపాడు గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి కృషి



చైర్‌పర్సన్ రాజుబాబును సత్కరించిన నాయకులు

పాయకరావుపేట: స్థానిక పీఏసీఎస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పర్సన్ ఇన్‌చార్జి దేవవరపు రాజుబాబు తెలిపారు. ఆయన గురువారం పీఏసీఎస్‌లో పదవి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రైతుల అభినందన సభలో రాజుబాబు మాట్లాడుతూ పీఏసీఎస్ వ్యాపార లక్ష్యం రూ.30 కోట్లు వరకు పెంచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేష్, మజ్జూరి నారాయణరావు, సంఘం సీఈవో పినపాత్రుని నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు లీలా తెలిపారు. చిన్న జీయర్‌స్వామి హెల్త్ కేర్ ఆధ్వర్యంలో పెదగుమ్ములూరులో 150 మంది మహిళలకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ టెస్టుల్లో కేన్సర్ లక్షణాలు బయటపడిన వారికి ఉచిత వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని స్థానిక నాయకుడు యేజర్ల నవీన్‌రాజు తెలిపారు.

అలరించిన సంకీర్తనలు



ఆలపిస్తున్న సంకీర్తనలు

మునగపాక:మండలంలోని గవర్ల అనకాపల్లిలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన అన్నమయ్య సంకీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గవర్ల అనకాపల్లికి చెందిన ఆళ్ల వెంకటరావు ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మునగపాకకు చెందిన అన్నమయ్య స్వర తరంగిణి కళాకారులతో ఏర్పాటు చేసిన సంకీర్తనలు అందరినీ అలరించాయి. అన్నమయ్య స్వర తరంగిణీ అధ్యక్ష, కార్యదర్శులు వెలగా ప్రవీణ శ్రీనివాసరావు, మొల్లేటి సరళ పాల్గొన్నారు.